# మీకు తెలుసా?

1. జలాంతర్గామి (Submarine) నిర్మాణము, తిమింగలము (Whale) శరీర నిర్మాణము దృష్టిలో ఉంచుకొని చేసారు. తిమింగలము శరీరము ఈదడానికి అనువైన నిర్మాణం కలిగి ఉంది. దీని శరీరము మృదువుగా, సముద్రములో ఈదునపుడు ఘర్షణ శక్తి ప్రభావం ఎక్కువ లేకుండా ఉంటుంది. దీని తలపై 'బ్లో హోల్' అమరిక శ్వాసించడానికి ఉపయోగపడుతుంది.

2. తిమింగలమునకు, డాల్ఫిన్‌కు తేడా ఏమిటి? డాల్ఫిన్‌లు, ఆహారాన్ని అందుకోడానికి పదునైన పళ్ళు కలిగిన చిన్న తిమింగలాలు.

3. మగ సీల్స్ వాటి భాగస్వామిని ఆకర్షించడానికి, శత్రువులను భయపెట్టడానికి, ముక్కులోనికి గాలిని ఊదుతాయట. ఆ గాలివలన ముక్కు పుటములోని పొర ఉబ్బి ఓ ఎర్రటి, పెద్ద బుంగలాగ తయారవుతుందట. వింతగా ఉంది కదా!

4. నీలి తిమింగలము (Blue Whale) సముద్రములో నివసించే అతిపెద్ద క్షీరదము(mammal). ఇది 100 అడుగులకు మించి పెరుగుతుంది. 130 టన్నుల బరువు వరకు పెరుగుతుంది.

5. డ్యుగాంగ్ అనబడే క్షీరదమునకు, దాని దంతములకు ఉన్న వృత్తాల సంఖ్యను బట్టి దాని వయస్సును లెక్క కడతారు. ఇది 60 నుండి 70 సంవత్సరములు జీవిస్తుంది. అలాగే ఒక చెట్టు వయస్సు కనుగొనడానికి దాని కాండాములోని వృత్తముల సంఖ్యను బట్టి తెలుసుకోవచ్చనే విషయము మీకు తెలుసు కదా!

6. కిల్లర్ వేల్ త్వరగా ఈదే సముద్ర జీవి. దీని శరీర నిర్మాణం, శక్తివంతమైన తోక కారణముగా ఇది గంటకు 35 మైళ్ళ వేగాన్ని అందుకోగలదు, అంటే అతి వేగముగా ఈదే ఈతగాని కంటే 6 రెట్లు ఎక్కువన్నమాట.

7. గోదుమ రంగు తిమింగలములు వేసవిలో ఆర్కిటిక్ (ఉత్తర ధృవం) నుండి, చలికాలంలో మెక్సికో తీరానికి చేరుతాయి. మళ్ళీ వసంతకాలానికి తిరిగి ఆర్కిటిక్ చేరుతాయి. అంటే రానూ పోనూ కలిపి 12,500 మైళ్ళ ప్రయాణమన్న మాట.

8. బ్లూ వేల్స్, ఎగరుతున్నప్పుడు జెట్ విమానము చేసే శబ్దము కంటే బిగ్గరగా శబ్దం చేస్తాయట. ఆ శబ్దం 300 మైళ్ళ దూరం వరకు వినిపిస్తుందంటే, చిన్నపిల్లలు చేసే గొడవ ఎంతో నయమన్నమాట.

9. బ్లూ వేల్స్ రోజుకు 4 టన్నుల క్రిల్ (రొయ్యల వంటి జీవులు) వరకు గుటకాయస్వాహ అనిపిస్తుందట. అంటే మనము 5 సంవత్సరములలో తినే భోజనానికి సమానమన్న మాట. ఆశ్చర్యం!

10. స్పెర్మ్ వేల్ మెదడు 20 పౌండ్ల బరువు ఉంటుందట. అంటే మనిషి మెదడుకు సుమారుగా 6 రెట్లు. అదృష్టవసాన దాని తల ఆ మెదడు పట్టేంత పెద్దదిగా ఉంటుంది.